క్లుప్తంగా

పీహెచ్‌సీ సిబ్బంది నిర్వాకం

కుప్పలుగా గడువు ముగిసిన మందులు



శాయంపేట : మండల కేంద్రంలోని పీహెచ్‌సీ సిబ్బంది, వైద్యాధికారి నిర్వాకం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని స్థానికులు విమర్శిస్తున్నారు. గడువు ముగిసిన, వాడి పడేసిన మందులు, సిరంజీలు, నీడిల్స్, వ్యర్థాలను ఆరోగ్య కేంద్రం వెనకాల గల ఖాళీ స్థలంలో కుప్పలుగా పోసి చేతులు దులుపుకొంటున్నారని పలువురు మండిపడుతున్నారు. నిబంధనల ప్రకారం ఆరోగ్య కేంద్రంలో సోఫ్‌పిట్‌ను ఏర్పాటు చేసి అందులో వేసి దానిపై మూతను బిగించి ఎవరికీ కనిపించకుండా ఉంచాల్సి ఉంటుంది. కానీ సిబ్బంది నిర్లక్ష్యం, వైద్యాధికారుల పర్యవేక్షణ కరువుతో పీహెచ్‌సీ ఆవరణలోనే కుప్పలుగా పోస్తుండడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గడువు ముగిసిన మందులు, సిరంజీలను పిల్లలు తెలియక తీసుకెళ్లి వినియోగిస్తే ప్రాణానికి ప్రమాదం జరుగుతుందని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కాగా ఈ విషయమై మండల వైద్యాధికారి సాయికృష్ణను వివరణ కోరగా.. పీహెచ్‌సీలో సోఫ్‌పిట్ అందుబాటులో లేదని, దూరంగా గుంత తీసి మందుల వ్యర్థాలను, గడువు దాటిన మందులను అందులో వేస్తున్నామని తేలికగా చెప్పారు.

'అవకాశాలను అందిపుచ్చుకోవాలి'

ధర్మసాగర్ : విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని మోటివేషన్ స్పీకర్ మాదర బోయిన ఆదిత్య యాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ధర్మసాగర్ గ్రామ దివంగత ఉపాధ్యాయుడు సత్యనారాయణ రాజు స్మారకార్థం ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ధర్మప్రకాశ్ అధ్యక్షతన మంగళవారం మోటివేషనల్ స్పీచ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిత్యయాదవ్ మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థుల ఎదుగుదలకు ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. కృత్రిమ మేధా అనేది సాంకేతిక రంగంలో విప్లవమని, ఇది ప్రయోగశాల స్థాయి దాటి మానవ నిత్య జీవిత సమస్యల పరిష్కారానికి ఉపయోగపడుతుందన్నారు. అంతకు ముందు ఆదిత్యయాదవ్ బృందం క్రీడా సామగ్రిని అందించింది. సత్యనారాయణ రాజు కుమారుడు రఘుపతిరాజు, లలిత్ రాజు పాల్గొన్నారు.


ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

ఆత్మకూరు /నడికూడ : ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందిస్తున్నట్లు ఎంఈఓ విజయ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని గొల్లవాడ ప్రాథమిక పాఠశాలలో ఎన్ఆర్ఐ కాసుల మురళీకృష్ణ రూ.10 వేల విలువ చేసే బ్యాగులు, కంపాక్స్ బాక్సుల అందించగా మంగళవారం ఆయన విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన అనేక మంది విద్యార్థులు ఉన్నతస్థానాల్లో స్థిరపడినట్లు తెలిపారు. ప్రైవేట్‌కు ధీటుగా విద్యాబోధన చేస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు విద్యార్థులను చేర్పించాలని అన్నారు. కాగా నడికూడ మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశా విద్యార్థులకు మంగళవారం ప్రధానోపాధ్యాయుడు సుదర్శన్, మాజీ సర్పంచ్ చాడ తిరుపతిరెడ్డి నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు చదివే విద్యార్థులకు ఉచిత నోట్‌బుక్స్ అందిస్తున్నట్లు చెప్పారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

ఐనవోలు : పేకాడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సింగారం గ్రామంలో పేకాడుతున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో 52 పేక ముక్కలు, రూ. 3,100 నగదుతో పాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా మరో ముగ్గురు పారిపోయినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పచ్చని చెట్లపై గొడ్డలివేటు



శాయంపేట : పచ్చని చెట్లపై గుర్తుతెలియని వ్యక్తులు గొడ్డలివేటు వేసి నేలమట్టం చేశారు. ఈ సంఘటన మండలంలోని జోగంపల్లి వెలుగుచూసింది. గ్రామ శివారులో గత ప్రభుత్వం అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా మొక్కలు నాటగా అవి ఏపుగా పెరిగి చెట్లుగా మారాయి. అయితే గుర్తుతెలియని వ్యక్తులు వాటిని నెలమట్టం చేశారు. పర్యావరణానికి పరిరక్షణకు దోహదపడే పచ్చని చెట్లను ఇష్టానుసారంగా నరికివేయడంతో ప్రకృతి ప్రేమికులు ఆగ్రహిస్తున్నారు.

సారూ..సర్టిఫికెట్లు జారీ చేయరూ!

- తహసీల్దార్ కార్యాలయం చుట్టూ విద్యార్థుల ప్రదక్షిణ
- రెండు వారాలు గడిచినా జారీకాని కుల, ఆదాయ, నివాసం ధ్రువీకరణ పత్రాలు
- కుప్పలుగా పేరుకుపోయిన దరఖాస్తులు
- భూ భారతి, ఇతర కార్యకలాపాలపై దృష్టిపెట్టిన రెవెన్యూ సిబ్బంది



తహసీల్దార్ కార్యాలయంలో మాన్యువల్ పత్రాలు వెతుక్కుంటున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

శాయంపేట : విద్యార్థులు పైచదువుల కోసం పాఠశాలలు, కళాశాలల్లో సమర్పించే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నారు. మీ సేవ కేంద్రంలో ఆన్‌లైన్ చేస్తున్నప్పటికీ తహసీల్దార్ కార్యాలయం నుంచి సర్టిఫికెట్ జారీ చేయడం లేదని పలువురు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ సిబ్బంది భూ భారతి, ఇతర ప్రభుత్వ కార్యకలాపాలపై దృష్టి సారిస్తూ సర్టిఫికెట్ల జారీని పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

మాన్యువల్ ఫామ్‌లు వెతుక్కోండి..

తహసీల్దార్ కార్యాలయం నుంచి సర్టిఫికెట్లు జారీ కాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు కార్యాలయానికి వెళ్లి రెవెన్యూ సిబ్బందిని బ్రతిమిలాడుతున్నట్లు సమాచారం. రోజుల తరబడి సర్టిఫికెట్లు జారీ చేయకపోవడంతో దరఖాస్తులు కుప్పలుగా పేరుకుపోయాయని, అందులో తమ ఫామ్ ఎక్కడ ఉందో వెతుక్కోండి అంటూ సిబ్బంది చెప్తుతున్నారని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మీసేవాలో ఆన్‌లైన్ చేసి రోజులు గడుస్తున్నా తహసీల్దార్ సర్టిఫికెట్లను జారీ చేయకపోవడంతో కళాశాలల్లో, పాఠశాలల్లో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని అంటున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి త్వరితగతిన మంజూరు చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

దరఖాస్తు చేసి 14 రోజులు అవుతుంది



నేను ఇంటర్మీడియట్ పూర్తిచేశాను. ఉన్నత చదువుల కోసం కులం, ఆదాయం, నివాసం సర్టిఫికెట్ల అవసరం కాగా 14రోజుల క్రితం మీసేవాలో ఆన్‌లైన్ చేశాను. ఇప్పటి వరకు సర్టిఫికెట్లు జారీ చేయలేదు. మీసేవా నిర్వహకులను అడిగితే తహసీల్దార్ కార్యాలయం నుంచి జారీ కాలేదని అంటున్నారు. అక్కడికి వెళ్తే కుప్పలుగా ఉన్న మాన్యువల్ ఫామ్‌ను వెతుక్కోవాలని అంటున్నారు. ధ్రువీకరణ పత్రాలు కావాలని కాలేజీలో అడుగుతున్నారు. ఇప్పటికైనా తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది స్పందించి సర్టిఫికెట్లను వీలైనంత త్వరగా జారీ చేయాలి.

\- బానోతు సాత్విక్, విద్యార్థి, గంగిరేణిగూడెం

వసూలు చేసిన డబ్బులు తిరిగివ్వండి

- యూత్ కాంగ్రెస్ నాయకుల డిమాండ్



డబ్బులు తీసుకున్నట్లు సీపీఐ నాయకులు ఇచ్చిన రసీదులు చూపుతున్న శ్రీకాంత్

కమలాపూర్ : ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్రూం ఇళ్లు ఇప్పిస్తామని నమ్మబలుకుతూ సీపీఐ నాయకులు నిరుపేదల నుంచి వసూలు చేసిన డబ్బులు వెంటనే తిరిగి ఇవ్వాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూడ శ్రీకాంత్ డిమాండ్‌చేశారు. మండల కేంద్రంలోని డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద మంగళవారం విలేకరులతో మాట్లాడారు. గత రెండేళ్లుగా సీపీఐ నాయకులు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇప్పిస్తామని చెప్పి సుమారు 300 మంది నుంచి ఒక్కొక్కరి వద్ద విరాళాల పేరిట సుమారు రూ.10 వేల వరకు వసూలు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని ఆరోపించారు. డబ్బులిచ్చిన నిరుపేదలు తాము ఇచ్చిన డబ్బులు తమకు ఇవ్వాలని అడిగితే రేపు, మాపు అంటూ దాటవేయడమేగాకా మళ్లీ ధర్నాలు చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఇంటి స్థలం ఉన్న అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందన్నారు. మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద మౌలిక వసతుల పనులు జరుగుతున్నాయని, పనులు పూర్తి కాగానే అర్హులందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయిస్తారని, అధికారులు అర్హుల జాబితా సిద్ధం చేస్తున్నారన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్రూంలు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేసే దళారులను నమ్మొద్దని ప్రజలకు సూచించారు. డబుల్ బెడ్రూంలు ఇప్పిస్తామని నిరుపేదల నుంచి డబ్బులు వసూలు చేయడాన్ని అధికారులు సీరియస్‌గా తీసుకోవాలని, సీపీఐ నాయకులు వసూలు చేసిన డబ్బులు వెంటనే నిరుపేదలకు ఇప్పించాలని కోరారు. యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి శ్రీకాంత్, మండల ఉపాధ్యక్షుడు రోహిత్, ప్రధాన కార్యదర్శి నవీన్, కార్యదర్శి శ్రీనివాస్, ఎన్ఎస్‌యూఐ నాయకుడు వంశీ, సత్యపాల్, బాధిత నిరుపేదలు పాల్గొన్నారు.

టీబీ రహిత సమాజ నిర్మాణమే ధ్యేయం

- వైద్యాధికారి నాగరాజు



గూడూరులో టీబీ వైద్యశిబిరం నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

కమలాపూర్ : టీబీ రహిత సమాజ నిర్మాణమే ధ్యేయమని పీహెచ్‌సీ వైద్యాధికారి నాగరాజు అన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా మంగళవారం మండలంలోని గూడూరు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో ఉచిత టీబీ వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ లక్షణాలున్న అనుమానితులు 45 మంది నుంచి నమూనాలు సేకరించి వైద్య పరీక్షలు నిర్వహించారు. టీబీకి గురైన వారి కుటుంబ సభ్యులు 11 మందిని ఎక్స్‌రే పరీక్షల నిమిత్తం 102 ద్వారా హనుమకొండలోని టీబీ ఆస్పత్రికి తరలించి పరీక్షించారు. అనంతరం డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ.. క్షయవ్యాధి నివారణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, క్షయ వ్యాధిగ్రస్తులు సకాలంలో మందులు వాడితే వ్యాధి నయం అవుతుందన్నారు. టీబీ వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని అన్నారు. డాక్టర్ మాధవి, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణారెడ్డి, ఎస్‌టీఎల్ఎస్ శ్రీనివాస్, జనార్దన్, ఎల్‌టీ చంద్రమౌళి, హెల్త్ అసిస్టెంట్లు రవీందర్, గోవర్ధన్, రాము, బాబు, ఏఎన్ఎంలు రమాదేవి, లావణ్య, ఆశాలు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు ప్రతాప్ మృతి

- ఎమ్మెల్యే కడియంతో పాటు పలువురి నివాళి



ప్రతాప్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

కాజీపేట : 61వ డివిజన్ సిద్దార్థనగర్ కాలనీలో మంగళవారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు రాజారపు ప్రతాప్ అనారోగ్యంతో మృతి చెందాడు. ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాలకు చెందిన ప్రతాప్ మూడు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేశారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం కాంగ్రెస్‌లో అతితక్కువ కాలంలో మంచిపేరుతో పాటు పట్టును సాధించారు. దివంగతనేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడిగా నియమించారు. 2014, 2019లో కాంగ్రెస్ టికెట్ దక్కపోవడంతో అనుచరవర్గంతో కలిసి బీఆర్ఎస్‌లో చేరారు.

ప్రత్యేక ప్రార్థనలు...

ప్రతాప్ పార్థివదేహానికి ఫాతిమానగర్ కెథ్రడల్ చర్చిలో ఫాదర్లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి పార్థివదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాల నుంచి అన్ని రాజకీయ పార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకులు ప్రతాప్‌కు నివాళులర్పించారు. ప్రతాప్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

నడికూడ : విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈనెల 27న హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని నడికూడ, వరికోల్, రాయపర్తి, పులిగిల్ల ఉన్నత ప్రాథమిక పాఠశాలలోని ఉపాధ్యాయులతో కలిసి కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రావుల రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవకతవకలు లేకుండా ఉపాధి హామీ పనులు

పరకాల : మండలంలో జరిగిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో ఏలాంటి అవకవతవకలు లేకపోవడంపై 16వ విడత సామాజిక తనిఖీ బృందం అభినందనలు తెలిపింది. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు ఆధ్వర్యంలో ప్రిసైడింగ్ అధికారి ఏపీడీ శ్రీనివాసరావు, జిల్లా విజిలెన్స్ అధికారి నరసింహారెడ్డి, మండల ప్రత్యేక అధికారి విజయ్‌భాస్కర్ ఈజీఎస్ పనుల నివేదికను వెల్లడించారు. 10 గ్రామాల్లో 10 రోజులుగా ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ బృందం తనిఖీ చేసి నివేదిక తయారు చేసి అధికారులకు చదివి వినిపించారు. బాధ్యతాయుతంగా పనిచేసి పనులు పూర్తి చేసినందుకు ఎంపీడీఓ ఆంజనేయులుతోపాటు ఎంపీఓ విమల, ఏపీఓ ఇందిర, ఉపాధి హామీ సిబ్బందిని ఏపీడీ శ్రీనివాసరావు అభినందించారు. ఏఈ శ్రీలత, ఈసీ రజనీకాంత్, సోషల్ ఆడిట్ డీఆర్పీలు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపులపై 'టాస్క్‌ఫోర్స్' దాడులు



సీజ్ చేసిన గడువు దాటిన ఎరువులు, పురుగు మందులను చూపుతున్న పోలీసులు

ఐనవోలు : గడువు దాటిన రూ.1,78,925 విలువచేసే ఎరువులు, పురుగు మందులను స్వాధీనం చేసుకుని విక్రయదారుపై పోలీసులు కేసు నమోదు చేసిన సంఘటన మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. విశ్వసనీయ సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు ఐనవోలు, వెంకటాపూర్ గ్రామాల్లోని ఫర్టిలైజర్ షాపుల్లో మంగళవారం తనిఖీలు చేపట్టారు. కాగా వెంకటాపూర్ గ్రామంలోని న్యూ బిస్మిల్లా ఆగ్రో ఏజన్సీలో గడువు దాటిన నానో డీఏపీ, అసెంట్రీన్, విపుల్ పీజీఆర్, ఉలాలా, ఫెర్టెరా, సూపర్, జింక్, బ్యాక్టీరియా తదితర ఎరువులు, పురుగు మందులను విక్రయిస్తుండగా సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న సరుకుతో పాటు షాపు నిర్వాహకుడు ఎండీ. అజీమ్‌ను తదుపరి చర్యల నిమిత్తం జఫర్‌ఘడ్ పోలీసులకు టాస్క్‌ఫోర్స్ అధికారులు అప్పగించారు. కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటున్నట్లు జఫర్‌ఘడ్ ఎస్సై రాంచరణ్ తెలిపారు.

'మత్తు' మహమ్మారిని తరిమేయాలి



కమలాపూర్ : అవగాహన కల్పిస్తున్న ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి



ఎల్కతుర్తి : మోడల్ స్కూల్‌లో మాట్లాడుతున్న సీఐ పులి రమేశ్



ఆత్మకూరు : డ్రగ్స్ నిర్మూలన ప్రతిజ్ఞ చేస్తున్న సీఐ రంజిత్‌రావు

కమలాపూర్ : యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మత్తు మాయలో పడొద్దని కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిభాపూలే బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులకు మంగళవారం డ్రగ్స్ నిర్మూలనపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. గుట్కా, అంబర్, సిగరేట్, గంజాయి, డ్రగ్స్ వంటి వ్యసనాలకు బానిసైతే జీవితం నాశనం అవుతుందన్నారు. ఇటీవల కాలంలో డ్రగ్స్‌కు బానిసైన వారే తరచూ నేరాలకు పాల్పడుతున్నారని, డ్రగ్స్ మత్తులో ఏం చేస్తున్నారో తెలియక క్షణికావేశంలో నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. యువత, విద్యార్థులు చైతన్యవంతులై మత్తు పదార్థాలకు, వ్యసనాలకు బానిసాలైన వారిని గుర్తించి అవగాహన కల్పించి వారిని సరైన మార్గంలో పయనించేలా చూడాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. డ్రగ్స్ నిర్మూలనలో ప్రజలు సైతం తమవంతు సహకారం అందించాలని, ఎక్కడైనా గంజాయి, డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు, సేవిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ, ప్రిన్సిపాల్ రవీందర్, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీఐ సంతోష్ అన్నారు. మండలంలోని తిరుమలగిరి కేజీబీవీ పాఠశాలలో మంగళవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు ఏకాగ్రతతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. మాదకద్రవ్యాల వలన జీవితాలు నాశనం అవుతున్నాయని, విద్యార్థులు ఎట్టిపరిస్థితుల్లో మత్తు బారిన పడొద్దన్నారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఎస్సై తిరుపతి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ వాసవి పాల్గొన్నారు.

వేలేరు : డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలని ఎస్సై సురేశ్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో మాదకద్రవ్యాల వ్యతిరేక వారోత్సవాల్లో భాగంగా యువతకు అవగాహన కల్పించారు. డ్రగ్స్ వ్యతిరేక వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(దామెర) : మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దని పరకాల రూరల్ సీఐ రంజిత్‌రావు అన్నారు. దామెర మండలంలోని ఊరుగొండ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు బ్యాగులు, నోట్ బుక్స్, వాటర్ బాటిల్స్, స్టేషనరీ పంపిణీ చేశారు. అనంతరం మాదకద్రవ్యాల నిర్మూలన ప్రతిజ్ఞ చేశారు. ఎస్సై అశోక్, ఎంఈఓ రాజేష్‌కుమార్, హెచ్‌ఎం సత్యనారాయణ, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రమ పాల్గొన్నారు.

ఎల్కతుర్తి : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థులకు మాదక ద్రవ్యాల (డ్రగ్స్) నిర్మూలనపై సీఐ పులి రమేశ్ అవగాహన కల్పించారు. డ్రగ్స్ వలన కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. అలాగే విద్యార్థులు సెల్‌ఫోన్లకు బానిస కావొద్దని అన్నారు. ట్రైనీ ఎస్సై శ్రావణ్‌కుమార్, హెడ్‌కానిస్టేబల్ విటల్, పోలీస్ సిబ్బంది నిఖిల్, భాస్కర్, జ్యోతి, పాఠశాల ప్రిన్సిపాల్ లలిత, హెచ్‌ఎం భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

భీమదేవరపల్లిలో..

మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎస్సై సంద్రు సాయిబాబు సూచించారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయ్, డ్రగ్స్ రహిత మండలంగా భీమదేవరపల్లిని తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. యువకులు సహకరించాలని కోరారు.

రైతు భరోసాతో అన్నదాతల కళ్లలో ఆనందం



శాయంపేట : సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర



ఆత్మకూరు : సీఎం వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, అధికారులు



ఐనవోలు : మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

- ఎమ్మెల్యేలు గండ్ర, రేవూరి
- జిల్లా వ్యాప్తంగా అంబరాన్నంటిన 'రైతు భరోసా' సంబురాలు

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధులను సకాలంలో విడుదల చేయడంతో అన్నదాతల కళ్లలో ఆనందం కనిపిస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రైతు భరోసా సంబురాలు నిర్వహించగా ఆయన హాజరై సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. రాష్ట్రంలో రైతును రాజు చేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గత ప్రభుత్వం గుట్టలకు, పుట్టలకు, చెట్లకు రైతుబంధు సొమ్ము ఇచ్చిందని విమర్శించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

మండలంలో వివిధ అనారోగ్య కారణాలతో ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం పొంది ఆర్థికంగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరిన లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మంగళవారం పంపిణీ చేశారు. తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ ఫణిచంద్ర, ఏఓ గంగాజమున, ఏఈఓలు, పంచాయతీ కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, నాయకులు పాల్గొన్నారు.

వేలేరు : కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా ద్వారా 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమచేయడంతో మండలంలోని ఆ పార్టీ శ్రేణులు మంగళవారం సంబురాలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా రైతు వేదికల్లో సీఎం రేవంత్‌రెడ్డి రైతు నేస్తం ముఖాముఖిని వీక్షించారు. తహసీల్దార్ హెచ్.కోమి, మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, రవీందర్, ఏఈఓ శిల్పా పాల్గొన్నారు.

ఆత్మకూరు (దామెర) : రైతు బాంధవుడు సీఎం రేవంత్ రెడ్డి అని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. దామెర మండల కేంద్రంలో రైతు భరోసా సంబురాల్లో ఆయన పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షించారు. ఎంపీడీఓ కల్పన, ఏఓ రాకేష్, డిప్యూటీ తహసీల్దార్ ఖురేషి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి, నాయకులు రమణారెడ్డి, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

నడికూడ : రైతు భరోసా పథకంలో భాగంగా రైతుల ఖాతాల్లో నిధులు జమ చేసిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం సంబురాలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

ఐనవోలు : రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మెట మహేందర్ అన్నారు. రైతులకు సకాలంలో రైతు భరోసా నిధులు విడుదల చేసిన సందర్భంగా మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి సెంటర్ వద్ద మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షించారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రైతు భరోసా సంబురాలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌ను తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు వీక్షించారు. రైతు భరోసా నిధులు సకాలంలో రైతుల ఖాతాల్లో జమ చేయడం గొప్ప విషయమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కమలాపురం రమేశ్ పాల్గొన్నా

జాడలేని వర్షాలు.. ఎండుతున్న పంటలు

- రెయిన్‌గన్నులతో నీరు పారిస్తున్న రైతు



రెయిన్ గన్నులతో దుక్కులు పారిస్తున్న రైతు

ధర్మసాగర్ : ఈ ఏడాది వానాకాలం సీజన్ ప్రారంభమైనప్పటికీ వరుణ దేవుడు కరుణించకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మే నెలలో రుతుపవనాల రాకతో మండలంలోని పలు గ్రామాల్లో రోహిణి కార్తెలో తొలకరి వర్షాలకే రైతులు దుక్కులు దున్నుకుని పత్తి విత్తనాలు విత్తారు. మరికొన్నిచోట్ల బోరు బావుల కింద దుక్కులు సాగు చేసి పత్తి, మొక్కజొన్న ఇతర పంటలు వేశారు. వరి పొలాలకు నార్లు కూడా పోశారు. అయితే 15 రోజులుగా వర్షాలు లేకపోవడంతో పత్తి పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. 20 రోజుల క్రితం రైతులు దుక్కిలో కరిపదన్ ఉండటం వలన పత్తి విత్తనాలు నాటగా అవి 30 శాతం మొలిచి, మిగతా విత్తనాలు మురిగిపోతున్నాయి. మొలిచిన మొక్కలు కూడా వాడిపోతున్నాయి. ఈ క్రమంలో మండలంలోని దేవునూర్ గ్రామంలో రఘుసాల రామారావు అనే రైతు దిక్కుతోచని స్థితిలో తన దుక్కిలో రెయిన్ గన్నులు ఏర్పాటు చేసి మొలచిన పత్తి మొక్కలను కాపాడుకుంటున్నాడు. వర్షం కురిస్తే తమ పంటను దేవుడే కాపాడినట్లు అవుతుందని, వర్షం వేయి కళ్లతో ఎదురుచూస్తున్నాని రైతు తెలిపారు.

మల్టీపర్పస్ కార్మికురాలి మృతి

శాయంపేట : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న మల్టీపర్పస్ కార్మికురాలు నత్తి గీత అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. తహసీల్దార్ సత్యనారాయణ గీత మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తక్షణ సాయంగా రూ. 10వేలు అందించారు.